క్లుప్తంగా

మెనూ పాటించాలి



మధ్యాహ్న భోజనం పరిశీలిస్తున్న ఎంఈఓ

చింతపల్లి : ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన మెనూను సక్రమంగా పాటించాలని ఎంఈఓ గురువారావు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, మెనూ పాటించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట హెచ్‌ఎం ఆంజనేయులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఆర్టీసీ సేవలు సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న ఆర్టీసీ డీఎం

దేవరకొండ : ప్రయాణికులు ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని దేవరకొండ ఆర్టీసీ డిపో మేనేజర్ రాజీవ్ ప్రేమ్‌కుమార్ కోరారు. గురువారం దేవరకొండ ఆర్టీసీ డిపోలో అద్దె బస్సు డ్రైవర్లకు నిర్వహించిన ప్రత్యేక శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అద్దె బస్సు డ్రైవర్లు డ్రైవింగ్‌లో సంస్థ నిబంధనల మేరకు బస్సులు నడపాలని, ప్రయాణికుల పట్ల మర్యాదపూర్వకంగా మెలగాలని సూచించారు. ఈనెల 7 వరకు శిక్షణ కొనసాగుతుందని చెప్పారు. సమావేశంలో అసిస్టెంట్ మేనేజర్ భారతిబాయి పాల్గొన్నారు.

జిల్లా సదస్సును విజయవంతం చేయాలి

మిర్యాలగూడ అర్బన్ : మిర్యాలగూడ పట్టణంలో నిర్వహించనున్న చేతి వృత్తిదారుల జిల్లా సదస్సును విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా కన్వీనర్ గంజి మురళీధర్ కోరారు. గురువారం స్థానిక అమరవీరుల స్మారక భవనంలో నిర్వహించిన చేతి వృత్తిదారుల సంఘం సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా నాయకులు చౌగాని సీతారాములు, పాదిల్ల శ్రీనివాస్, అప్పారావు, గురువయ్య, అంజయ్య, వెంకటయ్య, దానేలు తదితరులు పాల్గొన్నారు.

అల్పాహారానికి విరాళం

నాగార్జునసాగర్ : నందికొండ మున్సిపాలిటీ హిల్‌కాలనీలోని బాలుర ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు అల్పాహారం అందించేందుకు ఆ పాఠశాలకు చెందిన ఇద్దరు ఉపాధ్యాయులు ముందుకు వచ్చారు. జీవశాస్త్రం బోధించే శ్రీదేవి, గణితం బోధించే శ్రీను చేరో రూ.2వేల చొప్పున రూ.4వేలు ప్రధానోపాధ్యాయుడు ప్రకాశ్‌కు గురువారం అందించారు.

మాల మహానాడు డివిజన్ అధ్యక్షుడిగా సురేష్

కొండమల్లేపల్లి : మాల మహానాడు దేవరకొండ డివిజన్ అధ్యక్షుడిగా చింతకుంట్ల గ్రామానికి చెందిన ఉపసర్పంచ్ యేకుల సురేష్ నియామకమయ్యారు. ఈ మేరకు గురువారం మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు తాళ్లపల్లి రవి, రాష్ట్ర అధ్యక్షుడు చిక్కుడు గుండాల, నల్లగొండ జిల్లా అధ్యక్షులు చింతపల్లి బాలకృష్ణ నియామకపత్రం అందజేశారు.

మిర్యాలగూడ క్వార్టర్స్ సాధన కమిటీ ఎన్నిక

మిర్యాలగూడ : పట్టణంలోని 41వ వార్డులో మిర్యాలగూడ క్యాంప్ క్వార్టర్స్ కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులుగా పాదిల ముత్తిలింగంగౌడ్, ఎండీ కుతుబుద్దీన్, సయ్యద్, మహేష్, చంటి, లక్ష్మమ్మ, గంగాధర్, భిక్షం తదితరులను ఎన్నుకున్నారు. వార్డు కౌన్సిలర్ దుర్గా సత్యం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జాని, భాస్కర్, విజయ్, రాపోలు భాస్కర్, గౌసియా, శ్రీనివాస్, సైదేశ్వరచారి, జనార్దన్, మురళి తదితరులు పాల్గొన్నారు.

సోషల్ మీడియా జాయింట్ కన్వీనర్‌గా నేరేళ్ల అజయ్

మిర్యాలగూడ టౌన్ : బీజేపీ ఐటీ, సోషల్ మీడియా నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ జాయింట్ కన్వీనర్‌గా మిర్యాలగూడ పట్టణంలోని సీతారాంపురం గ్రామానికి చెందిన నేరేళ్ల అజయ్ నియామకయ్యారు. ఈమేరకు బీజేపీ ఐటీ సెల్ రాష్ట్ర కన్వీనర్ వెంకటరమణ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

నాగార్జునరెడ్డికి నివాళి

మిర్యాలగూడ : మాడ్గులపల్లి మండలం కేశవాపురం గ్రామ సర్పంచ్ నెర్మటి నాగార్జునరెడ్డి (60) కొంతకాలంగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతూ బుధవారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎంసీ.కోటిరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు కెతావత్ శంకర్‌నాయక్, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొండేటి మల్లయ్యలు గురువారం నాగార్జునరెడ్డి మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను పరామర్శించారు. వారి వెంట జెడ్పీటీసీ పుల్లెంల సైదులు తదితరులు ఉన్నారు.

రికార్డులు ఉన్నట్లా.. లేనట్లా?

- ఆడిట్ కమిటీకి ఉపాధి హామీ రికార్డులు సమర్పించడంలో జాప్యం
- 11 రోజులవుతున్నా అందించని రికార్డులు
- 44 శాతం మాత్రమే అందజేత
- రికార్డులు ఇచ్చేందుకు గడువు కోరిన అధికారులు



రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

చందంపేట : చందంపేట మండలంలో చేపట్టిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులకు సంబంధించి ఆడిట్ చేపట్టేందుకు ఆడిట్ బృందం వచ్చి పదకొండు రోజులవుతున్నా పూర్తి స్థాయి రికార్డులు అందించడంలో అధికారులు జాప్యం చేస్తున్నారు. ఇప్పటి వరకు 44 శాతం రికార్డులు మాత్రమే సమర్పించడం, పూర్తిస్థాయిలో రికార్డులు ఇవ్వకపోవడంతో పలు అనుమానాలకు తావిస్తోంది. ఉపాధి హామీ పథకంలో భాగంగా 2019, అక్టోబర్ 10 నుంచి 2022 మార్చి 31 వరకు చేపట్టిన ఉపాధి హామీ పనులకు సంబంధించి ఆడిట్ నిర్వహించేందుకు ఆడిట్ బృందం ఎంపీడీఓ కార్యాలయానికి వచ్చింది. రూ.8.23కోట్ల పనులకు సంబంధించి రికార్డులను ఆడిట్ బృందానికి ఇచ్చిన అధికారులు మిగతా రూ.10.13 కోట్ల పనుకు సంబంధించి పూర్తి స్థాయి రికార్డులు సమర్పించకపోవడంతో బృందం సభ్యులు మరొక మండలానికి వెళ్లాల్సి వచ్చింది.

అధికారుల తీరుపై అనుమానాలు

ఉపాధి హామీ పథకానికి సంబంధించి ప్రతిసారి ఎంతోకొంత అవినీతి బయటపడుతూ వస్తోంది. అయితే ఈసారి మాత్రం అధికారులు ఆడిట్ సభ్యులకు రికార్డులు ఇవ్వకపోవడం చర్చనీయాంశంగా మారింది. నిత్యం కార్యాలయంలోనే ఉండే అధికారులు పూర్తి స్థాయి రికార్డులు అందించకపోవడంపై పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. రికార్డులు కనిపించకపోవడంపై అధికారుల హస్తం ఏమైనా ఉందా?, అవినీతికి ఆస్కారం ఉండడంతోనే రికార్డులు అందించడంలో జాప్యం చేస్తున్నారా? అనేది తేలాల్సి ఉంది.

నాలుగు రోజులు గడువు కోరుతూ పీడీకి వినతి

ఆడిట్ సభ్యులు చందంపేట ఎంపీడీఓ కార్యాలయానికి వచ్చి పదకొండు రోజులవుతున్న క్రమంలో పూర్తి స్థాయి రికార్డులు అందించకపోవడంతో అధికారుల తీరు పట్ల సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. ఈ క్రమంలో ఆడిట్ బృందానికి రికార్డులు సమర్పించేందుకు నాలుగు రోజులు గడువు ఇవ్వాల్సిందిగా చందంపేట ఎంపీడీఓ కార్యాలయం నుంచి పీడీకి అర్జీ పెట్టుకున్నారు. దీంతో స్పందించిన పీడీ నాలుగు రోజులు గడువు ఇచ్చారు. ఈ నాలుగు రోజుల్లో రికార్డులు దొరుకుతాయా.. లేదా మరేదైనా సాకు చెబుతారా అనేది వేచిచూడాలి.

నాలుగు రోజులు గడువు కోరాం

కరోనా సమయంలో విధి నిర్వహణ, పని ఒత్తిడి కారణంగా రికార్డుల సమర్పించడంలో కొంత ఆలస్యమైంది. ఆడిట్ బృందానికి రికార్డులు సమర్పించేందుకు గాను పీడీకి నాలుగు రోజులు గడువు కోరాం. ఈ నాలుగు రోజుల్లో రికార్డులు సమర్పించేలా మా వంతు ప్రయత్నం చేస్తున్నాం.

– రాములునాయక్, ఎంపీడీఓ, చందంపేట

పదకొండు రోజులు గడిచాయి

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులకు సంబంధించి ఆడిట్ నిర్వహించేందుకు చందంపేట ఎంపీడీఓ కార్యాలయాకి వచ్చి పదకొండు రోజులు గడిచాయి. పూర్తి స్థాయి రికార్డులు ఇవ్వకపోవడం, పీడీ నాలుగు రోజులు గడువు ఇవ్వడంతో చేసేదేమీ లేక వేరే మండలానికి వెళ్లాం.

– రమేశ్, ఎస్‌ఆర్‌పీ, ఆడిట్ బృందం సభ్యుడు

గంధం ఊరేగింపు

చింతపల్లి : మండల పరిధిలోని వింజమూరు గ్రామంలో అజహరత్ దావూద్ షరీఫ్ ఉర్సులో భాగంగా గురువారం తెల్లవారుజామున దర్గా నుంచి ఒంటెపై గంధం ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా దర్గాలో నిర్వహించిన పూజల్లో ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాల్లో జెడ్పీటీసీ కంకణాల ప్రవీణ, దొంతం చంద్రశేఖర్‌రెడ్డి, సర్పంచ్ దండేటికార్ లలితబాయి, ప్రసాద్, జంగయ్య, రమావత్ బిచ్చానాయక్, వెంకటయ్య పాల్గొన్నారు.

మహిళలపై హింసను అరికట్టడంలో విఫలం



సభ్యత్వ నమోదులో పాల్గొన్న ఐద్వా నాయకులు

మిర్యాలగూడ అర్బన్ : మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని ఐద్వా నాయకురాలు పాదూరి గోవర్ధని అన్నారు. గురువారం మిర్యాలగూడ పట్టణంలోని హనుమాన్‌పేట లో నిర్వహించిన సభ్యత్వ నమోదులో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో కరీమ, షాహిన్, నాగలక్ష్మి, కవిత, సరిత, కోటమ్మ, చాందిని, యాదమ్మ, లక్ష్మి ఉన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో బీసీలకు తీవ్ర అన్యాయం



మాట్లాడుతున్న వెంకటేష్ గౌడ్

మిర్యాలగూడ టౌన్ : కేంద్ర బడ్జెట్‌లో బీసీలకు తీవ్ర అన్యాయం జరిగిందని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాలగాని వెంకటేష్ గౌడ్ ఆరోపించారు. గురువారం మిర్యాలగూడలోని షాబునగర్‌లో నిర్వహించిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలకు జరుగుతున్న అన్యాయాన్ని నిలదీసేందుకు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య ఆధ్వర్యంలో ఈనెల 8, 9వ తేదీల్లో నిర్వహించనున్న హలో బీసీ.. చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో వెంకటయ్య, నక్క నగేష్ గౌడ్, వీరాంజనేయులు, ఇంద్రాచారి పాల్గొన్నారు.

బీసీల సంక్షేమాన్ని గాలికి వదిలేసిన కేంద్రం

కేంద్ర బడ్జెట్‌లో బీసీలకు తీవ్ర అన్యాయం జరిగిందని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగం గౌడ్ ఆరోపించారు. గురువారం స్థానికంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. రూ.45లక్షల కోట్ల కేంద్ర బడ్జెట్‌లో బీసీలకు కేవలం రూ.1,500 కోట్లు మాత్రమే కేటాయించి బీసీలను పూర్తిగా అవమానించిందని తెలిపారు.

గ్రామీణ క్రీడలకు అధిక ప్రాధాన్యం

- ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి



బహుమతి అందజేస్తున్న ఎమ్మెల్సీ కోటిరెడ్డి

పెద్దవూర : ప్రతి గ్రామ పంచాయతీలో క్రీడా మైదానాలను ఏర్పాటు చేసి క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నట్లు స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి తెలిపారు. పెద్దవూర మండలంలోని తుంగతుర్తి గ్రామంలో శ్రీపార్వతీ సమేత స్వయంభూసోమేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం సందర్భంగా నిర్వహించిన రెండు తెలుగు రాష్ట్రాల కబడ్డీ పోటీల్లో విజేతలకు బుధవారం రాత్రి బహుమతులు అందజేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ క్రీడలకు అధిక ప్రాధాన్యమిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీలు చెన్ను అనురాధసుందర్‌రెడ్డి, ఆంగోతు భగవాన్‌నాయక్, వెనిగండ్ల పీఏసీఎస్ చైర్మన్ కేవీ రామారావు, యడవెల్లి దిలీప్‌రెడ్డి, అల్లి పెద్దిరాజు, షేక్ అబ్బాస్, నాదేండ్ల కృష్ణారెడ్డి, ఇంద్రకిరణ్, నక్కల రామాంజిరెడ్డి, క్రీడల నిర్వాహకుడు సత్యనారాయణ, రాజశేఖర్ పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి పేదలకు వరం

హాలియా : సీఎం సహాయ నిధి పేదలకు వరమని ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి అన్నారు. గురువారం హాలియా పట్టణంలో నియోజకవర్గంలోని 33 మంది లబ్ధిదారుల మంజూరైన రూ.13,26,000 సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ ఇరిగి పెద్దులు, గుర్రంపోడు జెడ్పీటీసీ గాలి రవికుమార్ గౌడ్, తిరుమలగిరి (సాగర్) మండల ఎంపీపీ ఆంగోతు భగవాన్ నాయక్, వైస్ ఎంపీపీ యడవెల్లి దిలీప్‌కుమార్, వెనిగండ్ల సొసైటీ చైర్మన్ కేవీ రామారావు, బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు మన్నెం రంజిత్ యాదవ్, మాజీ మార్కెట్ చైర్మన్ ఎక్కల్లూరి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీపీ అల్లి పెద్దిరాజు యాదవ్, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు వద్దిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్‌లు,, రైతు బంధు కోఆర్డినేటర్లు, రైతు బంధు సమితి నాయకులు తదితరులు ఉన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

- ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్



ప్రశాంతపురితండాలో సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రకుమార్

చింతపల్లి : గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. గురువారం చింతపల్లి మండల పరిధిలోని ప్రశాంతపురితండాలో రూ.20లక్షలతో సీసీరోడ్లు, మరో రూ.20లక్షలతో చేపట్టిన గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కంకణాల ప్రవీణ, సర్పంచ్ కేతావత్ బంగారి జగన్‌నాయక్, ఎంపీటీసీ కుంభం శ్వేత, ఉపసర్పంచ్ ఇస్లావత్ రమేశ్, దొంతం చంద్రశేఖర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ గోపిడి కృష్ణారెడ్డి, ఉజ్జిని విద్యాసాగర్‌రావు, వింజమూరి రవి, అక్రమ్ పాల్గొన్నారు.

దైవచింతనతో మానసిక ప్రశాంతత

కొండమల్లేపల్లి : దైవచింతనతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. గురువారం కొండమల్లేపల్లి పట్టణంలోని రేణుక ఎల్లమ్మ దేవాలయంలో నిర్వహించిన ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేవాలయాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను సన్మానించారు. అదేవిధంగా మండలంలోని గౌరికుంటతండాలో నూతనంగా నిర్మించిన ఆర్చిని ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో చింతపల్లి జెడ్పీటీసీ ప్రవీణ, సర్పంచ్ కుంభం శ్రీనివాస్‌గౌడ్, యుగేందర్‌రెడ్డి, కేసాని లింగారెడ్డి, రమావత్ దస్రూనాయక్, ఉప సర్పంచ్ గంధం సురేష్, మాడ్గుల యాదగిరి, కాశయ్య, భీమ్‌సింగ్, లాలునాయక్, రాములు, వెంకటయ్య పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

దేవరకొండ : పీఏపల్లి మండల పరిధిలోని కోదండాపురం శ్రీ పద్మావతి గోదా సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలను ఈనెల 10 నుంచి ఈనెల 16వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ తెలిపారు. ఈమేరకు గురువారం బ్రహ్మోత్సవాల వాల్‌పోస్టర్లను దేవరకొండలోని తన క్యాంప్ కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ వంగాల ప్రతాప్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ వల్లపురెడ్డి, ముచ్చర్ల ఏడుకొండలుయాదవ్, అర్వపల్లి నర్సింహ, పరమేశ్, చందు పాల్గొన్నారు.

గొర్రెల పంపిణీకి అధిక నిధులు కేటాయించాలి



మాట్లాడుతున్న శ్రీనివాస్ యాదవ్

మిర్యాలగూడ టౌన్ : రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 3న ప్రవేశపెట్టబోయే బడ్జెట్‌లో గొర్రెల పంపిణీ పథకానికి అధిక నిధులు కేటాయించాలని గొర్రెల పెంపకం దారుల సహకార సంఘం డివిజన్ అధ్యక్షుడు ఉరిబండి శ్రీనివాస్ యాదవ్ కోరారు. గురువారం మిర్యాలగూడలోని సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ సంఘంలో సభ్యత్వం ఇచ్చి, వారికి కూడా ఈ పథకాన్ని అందించాలన్నారు. సమావేశంలో సంఘం నాయకులు చిమట యర్రయ్య యాదవ్, కుంటిగొర్ల కోటేష్‌యాదవ్, లెంకల నాగరాజు యాదవ్, మాజీ సర్పంచ్ చింతకాయల సతీష్, గడ్డమీది సైదులు, చిమట శ్రీనివాస్, మల్లిఖార్జున్, ఎల్లయ్య, కోటేష్ యాదవ్, నాగరాజు, సైదులు, వెంకన్న యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

గుత్తా సుఖేందర్‌రెడ్డి జన్మదిన వేడుకలు

మిర్యాలగూడ, దేవరకొండ, కొండమల్లేపల్లి, గుర్రంపోడు, పెద్దవూర : శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి జన్మదిన వేడుకలను గురువారం దామరచర్లలో బీఆర్‌ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ధీరావత్ నందిని, జెడ్పీటీసీ లలిత తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా దేవరకొండలో ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, ఎంపీపీలు తదితరులు పాల్గొన్నారు. గుర్రంపోడు మండలకేంద్రంలో జిల్లా ఎంపీపీల ఫోరం అధ్యక్షుడు మంచికంటి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో గుత్తా సుఖేందర్‌రెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహించారు. పెద్దవూరలో ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కొండమల్లేపల్లిలోని సాలిడార్ బధిరుల ఆశ్రమ పాఠశాలలో బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి పస్నూరి యుగేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు అన్నదానం నిర్వహించారు.

సీఎం కేసీఆర్ కృషితో గ్రామాలకు మహర్దశ

- ఎమ్మెల్యే భాస్కర్‌రావు



దామరచర్లలో సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే భాస్కర్‌రావు

మిర్యాలగూడ : సీఎం కేసీఆర్ కృషితోనే రాష్ట్రంలోని గ్రామాలకు మహర్దశ సంతరించుకుందని ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు అన్నారు. గురువారం దామరచర్ల మండల కేంద్రంతోపాటు 17 గ్రామాల్లో రూ.2.50కోట్ల ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధుల కింద చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ జిల్లా వైస్ చైర్మన్ దుర్గంపూడి నారాయణరెడ్డి, జిల్లా రైతు బంధు సమితి సభ్యులు కుందూరు వీరకోటిరెడ్డి, జెడ్పీటీసీ లలితాహతీరాంనాయక్, ఎంపీపీ ధీరావత్ నందినిరవితేజ, నాయకులు యూసుఫ్, నాగుల్ మీరా, దారగాని వెంకటేశ్వర్లు, పడిగపాటి పెదకోటిరెడ్డి, పంచాయతీరాజ్ డీఈ వెంకటేశ్వర్‌రావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

అందుబాటులో అధికారులు

- వ్యవసాయ కార్యాలయం నుంచే విధులు నిర్వహిస్తున్న ఏఈఓ

సాక్షి ఎఫెక్ట్



విధులు నిర్వహిస్తున్న త్రిపురారం క్లస్టర్ ఏఈఓ

త్రిపురారం : మండల కేంద్రంలోని ఎస్‌ఎస్పీ కార్యాలయ ఆవరణలో గత 40 సంవత్సరాల నుంచి ఉన్న వ్యవసాయ కార్యాలయాన్ని అధికారులు కొన్ని రాజకీయ కారణాల చేత మూసివేసి మండల కేంద్రంలో ఉన్న రైతు వేదికలో విధులు నిర్వహిస్తున్నారు. అయితే ఇదే రైతు వేదికను జనవరి 18 నుంచి కంటి వెలుగు నిర్వహణకు వినియోగిస్తున్నారు. దీంతో వ్యవసాయ కార్యాలయం మూసి ఉండడంతో త్రిపురారం మండల వ్యవసాయ అధికారులు విధులకు హాజరు కావడానికి ఇబ్బందిగా మారింది. అధికారులు అందుబాటులో లేకపోవడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయంపై 'సాక్షి' గత నెల 29వ తేదీన 'రైతు వేదికలో కంటి వెలుగు' శీర్షికన కథనం ప్రచురించింది. దీంతో స్పందించిన మండల వ్యవసాయ అధికారులు త్రిపురారం క్లస్టర్ ఏఈఓ పాత వ్యవసాయ కార్యాలయంలో రైతులకు అందుబాటులో ఉంటున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి విద్య

- ఎమ్మెల్యే నోముల భగత్



గుర్రంపోడు : కాల్వపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో ఎమ్మెల్యే భగత్

హాలియా : మన ఊరు– మనబడి ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయిలో విద్య అందిస్తున్నట్లు నాగార్జునసాగర్ ఎమ్మెల్యే నోముల భగత్ తెలిపారు. మన ఊరు–మనబడి కింద నూతనంగా నిర్మించిన అనుముల మండలంలోని పంగవానికుంట, కొత్తపల్లి ప్రాథమిక పాఠశాలలను గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కూరాకుల వెంకటేశ్వర్లు, హాలియా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జవ్వాజి వెంకటేశ్వర్లు, మండల ప్రధాన కార్యదర్శి యనమల సత్యం, సర్పంచ్‌లు మేగావత్ సాలీ, బూడిద స్వాతి, ఎంఈఓ బాలు నాయక్, ఎంపీటీసీ వెంకటయ్య, విద్యా కమిటీ చైర్మన్లు రంగ నాయక్, కనకరాజు రామాంజ నేయులు, ఎంపీడీఓ లక్ష్మి, ప్రధానోపాధ్యాయులు నెమలి వెంకట్‌రెడ్డి, మచ్చ సునిత, డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

మాతా శిశు సంరక్షణకు ప్రభుత్వం పెద్దపీట

మాతా శిశు సంరక్షణకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే భగత్ అన్నారు. నియోజకవర్గంలో నూతనంగా ఎంపికైన అంగన్‌వాడీ టీచర్లకు గురువారం హాలియా పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్‌చైర్మన్ ఇరిగి పెద్దులు, రాష్ట్ర ఆప్కాబ్ మాజీ చైర్మన్ యడవెల్లి విజయేందర్‌రెడ్డి, జెడ్పీటీసీ అబ్బిడి కృష్ణారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ వెంపటి పార్వతమ్మ, నిడమనూరు ఎంపీపీ బొల్లం జయమ్మ, మార్కెట్ కమిటీ చైర్మన్ మర్ల చంద్రారెడ్డి, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు బ్రహ్మానందరెడ్డి, సొసైటీ చైర్మన్ వెంకట్‌రెడ్డి ఉన్నారు.

సర్కార్ బడుల్లో సకల సౌకర్యాలు

గుర్రంపోడు : సర్కారు బడుల్లో సకల సౌకర్యాలు కల్పిస్తున్నామని ఎమ్మెల్యే నోముల భగత్ అన్నారు. గుర్రంపోడు మండలంలోని కాల్వపల్లి గ్రామ ప్రాథమిక పాఠశాలలో మన ఊరు– మన బడి కింద పనులు పూర్తి కాగా.. గురువారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ వెంకటేశ్వర్లు, సర్పంచ్ మారం కౌసల్య, వైస్ ఎంపీపీ వజ్జ రామేశ్వరీ, ఎంపీడీఓ శ్రీపాద సుధాకర్, ఎంఈఓ తరి రాము పాల్గొన్నారు.

వరిలో అగ్గితెగులు నివారణ చర్యలు చేపట్టాలి

గుర్రంపోడు : వరిలో అగ్గితెగులు నివారణకు వ్యవసాయ విస్తరణ అధికారుల సూచనలు పాటించాలని మండల వ్యవసాయ అధికారి కంచర్ల మాధవరెడ్డి అన్నారు. గురువారం గుర్రంపోడు మండలంలోని కొప్పోలులో వరి పొలాలను పరిశీలించి మాట్లాడారు. వరిలో అగ్గితెగులు, జింక్ లోపాలు గుర్తించినట్లు తెలిపారు. అగ్గితెగులు నివారణకు ట్రైసైక్లోజోన్ 75 శాతం, డబ్ల్యూపీ 0.6 గ్రాముల మందును లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. అదేవిధంగా టెట్‌కోనజోల్ మరియు ట్రైఆక్సీస్ట్రోబిన్ ఎకరాకు 100 గ్రాములు మందును 100 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. జింక్ లోపానికి జింక్ సల్ఫేట్ 2 గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని తెలిపారు.

కరాటే పోటీలో శాస్త్ర హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని చైతన్యనగర్‌లో ఉన్న శాస్త్ర హైస్కూల్ విద్యార్థులు అంతర్జాతీయ కరాటే పోటీలో ప్రతిభ కనబరిచినట్లు ఆ పాఠశాల చైర్మన్ అలుగుబెల్లి శ్రీనివాస్‌రెడ్డి, కరస్పాండెంట్ శ్రీధర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ మోహన్ కృష్ణ గురువారం తెలిపారు. హైదరాబాద్‌లో గత నెల 29న సవారి ఇంటర్నేషనల్ షాటోఖాన్ కరాటే అకాడమీ నిర్వహించిన అంతర్జాతీయ కరాటే పోటీలో పాఠశాలకు చెందిన స్నేహితరెడ్డి ప్రథమ స్థానంలో నిలిచి గోల్డ్ మెడల్ సాధించినట్లు తెలిపారు. ప్రణీత్, చైతన్య బోస్తా, మణికేతన్‌రెడ్డి, యశ్వంత్, సిద్ధార్థలు రెండో స్థానంలో నిలిచి సిల్వర్ మెడల్స్ సాధించారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను, కరాటే మాస్టర్ రామకృష్ణానాయక్‌ను పాఠశాల యాజమాన్యం అభినందించింది.



విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

మూడు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

మిర్యాలగూడ : అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకుని కేసులు నమోదు చేసినట్లు మాడ్గులపల్లి ఎస్‌ఐ నరేష్ గురువారం తెలిపారు. గుర్రప్పగూడేనికి చెందిన గంగినపల్లి సైదిరెడ్డి, బుగ్గిడి నరేష్, బొమ్మకల్ గ్రామానికి చెందిన దామెర్ల రాకేష్ ఆగామోత్కూర్ శివారులో గల పాలేరు వాగు నుంచి మూడు ట్రాక్టర్లలో ఇసుకను తరలిస్తుండగా ఇందుగుల గ్రామం వద్ద పట్టుకున్నట్లు తెలిపారు. ట్రాక్టర్లను స్టేషన్‌కు తరలించి, డ్రైవర్లపై కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

నిందితులను శిక్షించాలి

మిర్యాలగూడ అర్బన్ : యాదాద్రి భువనగిరి జిల్లాలోని మోత్కూరు మున్సిపాలిటీపై వార్త రాసిన విలేకరి యాదగిరిపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు అయూబ్ డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం ఆర్డీఓ కార్యాలయం ఎదుట నిరసన తెలిపి కార్యాలయ డీఏఓ రాధకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ ఖాజా హమీదుద్దీన్, సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు జి.వెంకన్న, పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

గుర్రంపోడు : బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు పాశం గోపాల్‌రెడ్డి మాతృమూర్తి పాశం రాములమ్మ ఇటీవల మృతిచెందింది. గురువారం మాజీ ఎమ్మెల్సీ పాతూరి సుధాకర్ రెడ్డి మండలంలోని పాశంవారిగూడెం గ్రామంలో రాములమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట పీఆర్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంజిరెడ్డి ఉన్నారు.

10న అవగాహన సదస్సు



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఎస్పీ అపూర్వరావు

రామగిరి(నల్లగొండ) : కనగల్ మండలం బండమీదిగూడెంలో ఈ నెల 10న సమాచార హక్కు పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో జరిగే సమాచార హక్కు అవగాహన సదస్సు కరపత్రాన్ని గురువారం ఎస్పీ అపూర్వరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జాతీయ చైర్మన్ డాక్టర్ బొమ్మరబోయిన కేశవులు మాట్లాడుతూ 10న నల్లగొండ నుంచి బండమీదిగూడెం వరకు ర్యాలీ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో జల సాధన సమితి జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు దుశ్చర్ల సత్యనారాయణ, సమాచార హక్కు పరిరక్షణ సమితి రాష్ట్ర కన్వీనర్ అంజయ్య, జిల్లా కన్వీనర్ భాస్కర్ ఉన్నారు.

నెలలు గడుస్తున్నా సమస్యలకు పరిష్కారం లేదు

- తిరుమలగిరి మండల సర్వసభ్య సమావేశంలో పలువురు సర్పంచ్‌ల అసంతృప్తి



సమస్యలపై అధికారులను ప్రశ్నిస్తున్న సభ్యులు

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : మూడు నెలల క్రితం సమావేశంలో చెప్పిన సమస్యలనే మరలా చెప్పాల్సి వస్తుందని, నెలలు గడుస్తున్నా సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదని పలు గ్రామాల సర్పంచ్‌లు ఆరోపించారు. గురువారం తిరుమలగిరి మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ ఆంగోతు భగవాన్ నాయక్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సభ్యులు తమ సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చారు. మండలంలోని 34 గ్రామపంచాయతీలు ఉండగా.. 27 పంచాయతీలకు ప్రతి నెలా జీపీలకు విడుదలయ్యే నిధులు అందలేదని, పాలన ఎలా సాగించాలని అల్వాల సర్పంచ్ పెంకీసు పాపిరెడ్డి ప్రశ్నించారు. గ్రామాల్లో ప్రస్తుతం సీసీ రోడ్ల పనులు జరుగుతున్నాయని, రోడ్డుకు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలను అధికారులు తొలగించాలని కొంపల్లి సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. తూటిపేట, గాత్‌తండాలకు ట్రాన్స్‌ఫార్మర్లు కావాలని గత సమావేశంలోనే అధికారుల దృష్టికి తీసుకువచ్చినా ఫలితం లేకుండా పోయిందని సర్పంచ్ రాంసింగ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఎంపీపీ భగవాన్ నాయక్ మాట్లాడుతూ సభ్యులు సమావేశంలో పేర్కొన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు అధికారులు చొరవ చూపాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీఓ ఖాజాఅస్గర్‌అలీ, ఎంపీఓ పద్మ, ఆయా శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.